

చిత్తూరులో ఫారెస్టు రోడ్డు పనుల్ని శుక్రవారం పర్యవేక్షిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల, ఎమ్మెల్యే గురజాల, చుడా చైర్‌పర్సన్ హేమలత, మేయర్ అముద, టీడీపీ నేతలు దొరబాబు, చంద్రప్రకాష్, కోదండయాదవ్



చిత్తూరు- వేలూరు రోడ్డు మరమ్మతు పనులు



కుప్పం- పచ్చూరు రోడ్డు నుంచి కుప్పం- కృష్ణగిరి రోడ్డు వరకు లింకు రోడ్డు మరమ్మతుల తర్వాత

రహదారుల రూపు మారుతోంది

జిల్లాలో రహదారులు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఛిద్రమైపోయిన రహదారులకు కూటమి ప్రభుత్వం మరమ్మతులు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం డిసెంబరులో రూ.23.12 కోట్లను ప్రభుత్వం కేటాయించగా.. గుడియాత్తం రోడ్డుకు రూ.5.90 కోట్లు, వేలూరు రోడ్డుకు రూ.2.50 కోట్ల ఉపాధిహామీ నిధులతో పనులు చేస్తున్నారు. సుమారు 85 శాతం పనులు పూర్తవగా.. మిగిలినవీ పురోగతిలో ఉన్నాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

- రూ.31.52 కోట్లతో జోరుగా మరమ్మతులు
- దాదాపు పూర్తి కావొచ్చిన 85 శాతం పనులు

ఆర్ అండ్ బీ పరిధిలోని రాష్ట్ర, జిల్లా రహదారులు సుమారు 1598 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయని అధికారులు అంచనా వేసి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో రెండు విడతల్లో రూ.23.12 కోట్లతో 329 పనుల్ని మంజూరు చేసింది. నవంబరు 2వ తేదీన జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి రహదారుల మరమ్మతు పనుల్ని లాంఛనంగా ప్రారంభించారు. సంక్రాంతి నాటికి ఈ పనుల్ని పూర్తి చేసే లక్ష్యంతో ప్రారంభించినప్పటికీ.. పనుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఆలస్యమైంది. ప్రస్తుతం 1598 కిలోమీటర్లలో 1362 కిలోమీటర్లు, 329 పనుల్లో 136 పనులు పూర్తయ్యాయి. రూ.5.36 కోట్లకుపైగా బిల్లుల్ని అప్లోడ్ కూడా చేశారు.

● తిరుపతి, మదనపల్లె ప్రాంతాల్లోనూ జోరుగా..

చిత్తూరు ఆర్ అండ్ బీ సర్కిల్ పరిధిలో తిరుపతి, మదనపల్లె డివిజన్లు కూడా ఉన్నాయి. తిరుపతిలో రూ.6.75 కోట్లతో 769 కిలోమీటర్ల మరమ్మతు పనుల్ని చేపట్టగా, 706 కిలోమీటర్లలో పనులు పూర్తయ్యాయి. అలాగే, మదనపల్లెలో రూ.5.69 కోట్లతో 727 కిలోమీటర్ల రహదారుల మరమ్మతు పనులు చేపట్టగా, 662 కిలోమీటర్లలో పనులు పూర్తయ్యాయి.

● జోరుగా గుడియాత్తం రోడ్డు పనులు

యాదమరి మీదుగా ప్రయాణించే చిత్తూరు-గుడియాత్తం రహదారి జిల్లాలోనే అత్యంత దారుణంగా ఛిద్రమైపోయింది. వైసీపీ హయాంలో అధికారులు ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపించినా, ఫలితం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రతిపాదనలు పంపించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవ తీసుకుని ఆయా పంచాయతీల్లోని ఉపాధిహామీ నిధుల్ని ఈ రహదారి మరమ్మతుకు కేటాయించారు. సుమారు రూ.5.90 కోట్లతో 8 భాగాలుగా దీన్ని అభివృద్ధి చేస్తున్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

రూ.2.50 కోట్లతో చిత్తూరు- వేలూరు రోడ్డు పనులు

వేలూరు మీదుగా ప్రయాణించే చిత్తూరు- కడలూరు రోడ్డు గుడిపాల మండల పరిధిలో అత్యంత దారుణంగా ఛిద్రమైపోగా.. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చొరవ తీసుకున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ రూ.2.50 కోట్ల ఉపాధి హామీ నిధుల్ని కేటాయించారు. ఇటీవల ఈ పనుల్ని కలెక్టర్, ఎమ్మెల్యే కలిసి ప్రారంభించారు.

‘పీవీకేఎన్’లో రెండో రోజూ న్యాక్ పరిశీలన



కోర్సుల పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న న్యాక్ బృందం

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ సంస్థ నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) కమిటీ రెండోరోజైన శుక్రవారం కూడా పరిశీలించింది. కమిటీ సభ్యులైన అసోం డాన్‌బాస్కో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జానీ జోస్, కర్ణాటక సెయింట్ జోసఫ్ కాలేజ్ అటానమస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పాల్ న్యూమెన్, గోవా యూనివర్సిటీ పూర్వ ప్రొఫెసర్ డాక్టర్ సుదర్శన్‌లు కళాశాల స్థితిగతులపై అధ్యయనం చేశారు. ఈ విషయాలను భారత ఉన్నత విద్యాసంస్థకు నివేదించనున్నారు. ముగింపు సమావేశంలో కళాశాల విద్యాప్రమాణాలను అభినందించి, కొన్ని సూచనలు, సలహాలిచ్చింది. న్యాక్ కమిటీకి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి

స్కాన్ చేయండి.. అభిప్రాయం చెప్పండి

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్యూఆర్ కోడ్ ఏర్పాటు
- వైద్య సేవలపై ప్రభుత్వం సర్వే

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై ప్రభుత్వం సర్వే చేపట్టింది. ఇందుకోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధిలోని సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కోడ్‌ను స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేసి.. పలు ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రశ్నలు ఇవే..

● ఆస్పత్రిలో డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉన్నారా ● వైద్యుల ప్రవర్తన ఎలా ఉంది ● సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది ● ఆస్పత్రిలో రాసిన మందులు ఇచ్చారా ● మిమ్మల్ని ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా ● ఆస్పత్రి పరిశుభ్రంగా ఉందా.. అనే ప్రశ్నలకు అవును, కాదు తరహాలో ఎంపిక చేసి నమోదు చేయాల్సి ఉంటుంది.



క్యాజువాలిటీ ఎదురు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

ఐవీఆర్ఎస్ ద్వారా కూడా..

ఆస్పత్రిలో చికిత్స తర్వాత ఇన్ పేషంట్లకు ఐవీఆర్ఎస్ ద్వారా కూడా కాల్ చేసి కూడా వైద్యసేవలను ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఇందులో ● వైద్యం ఎలా అందించారు ● సౌకర్యాలు ఎలా ఉన్నాయి. ● చికిత్స సమయంలో వైద్యులు, సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది.. అన్న ప్రశ్నలు ఉన్నాయి. వైద్య రంగానికి వందల కోట్లు ఖర్చు చేస్తున్నా రోగులు అసంతృప్తితో ఉన్నారని.. దీన్ని గాడిలో పెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమాలుకు శ్రీకారం చుట్టారు.

అవగాహన కల్పించాలి

క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారే కానీ.. అవి ఎందుకు పెట్టారన్న దానిపై రోగులకు అవగాహన కల్పించలేదు. అంతేకాకుండా క్యూఆర్ కోడ్‌లు కూడా చిన్నవిగా, ఎక్కడో ఒక ప్రాంతంలో ఏర్పాటు చేశారు. క్యూఆర్ కోడ్‌ను పెద్ద బ్యానర్ కింద ప్రత్యేకంగా ప్రదర్శిస్తే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

జిల్లా అడ్మినిస్ట్రేషన్ న్యాయమూర్తిగా జస్టిస్ సురేష్‌రెడ్డి

చిత్తూరు లీగల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా అడ్మినిస్ట్రేషన్ న్యాయమూర్తిగా జస్టిస్ కె.సురేష్‌రెడ్డిని నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈయన హైకోర్టులో న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్నారు.

పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా మోహనకుమారి



చిత్తూరుకు చెందిన సీనియర్ న్యాయవాది వి.మోహన కుమారిని చిత్తూరు కోర్టు ఆవరణలో ఉన్న పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు న్యాయవాదులు అభినందించారు.

8వ కోర్టు ఏపీపీగా జ్యోతిరామ్



చిత్తూరు కోర్టు ఆవరణలో ఉన్న 8వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా ఎ.జ్యోతిరామ్‌ను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నియమించింది. ఈ కోర్టులో ఏపీపీ పోస్టు ఏడాదికాలంగా ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జ్యోతిరామ్‌ను పలువురు న్యాయవాదులు అభినందించారు.

ఉత్సాహంగా మైలారు పండుగ

వి.కోట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం జవ్వనిపల్లెలో మైలారు పండుగను శుక్రవారం కోలాహలంగా నిర్వహించారు.యల్లమ్మ, గంగమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పశువుల పండుగను ప్రారంభించారు. గ్రామానికి తూర్పుదిశగా పశువులను పరుగులు పెట్టించారు. ముందస్తుగా ఏర్పాటు చేసిన బారికేడ్ల మధ్య నుంచి పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు



పరుగులు తీస్తున్న ఎద్దును ఆసక్తిగా చూస్తున్న జనం

యువకులు పోటీపడ్డారు. ఈ వేడుకలను తిలకించేందుకు పెద్దఎత్తున జనం తరలిరాగా ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి వందలాది ఎద్దులు ఈ పండుగలో పాల్గొన్నాయి. తమిళనాడులోని లత్తేరికి చెందిన ఎద్దుకు ప్రథమ బహుమతిగా రూ. 1.51 లక్షలు, ఏరుగుత్తికి చెందిన ఎద్దుకు రెండవ బహుమతిగా రూ. లక్ష, మూడవ బహుమతిగా వి.కోట మండలం చిన్నశ్యామ గ్రామానికి చెందిన ఎద్దుకు రూ.70 వేలు చొప్పున నిర్వాహకులు అందజేశారు. అలాగే పోటీల్లో సత్తాచూపిన 70 ఎద్దులకు కుక్కర్లు వంటి బహుమతులను వాటి యజమానులకు అందజేశారు.కాగా వి.కోట మండలం కృష్ణాపురానికి చెందిన ఓ ఎద్దు పండుగకు వచ్చి తప్పిపోయింది. దాని యజమాని ఎద్దు ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేసి ఆచూకీ తెలిసిన వారు తమకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

ద్రావిడ వర్సిటీలో నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

గుడుపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయం నూతన క్లాస్ రూమ్ కాంప్లెక్స్‌లో శనివారం ఉదయం 11 గంటలకు కామర్స్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ తెలిపారు. బెంగళూరుకు చెందిన రోమన్ సాంకేతిక కంపెనీ ప్రతి నిధులు డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లస్టర్ సమావేశ సమయాలను మార్చాలి: ఎస్టీయూ

వెదురుకుప్పం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శనివారం నుంచి జరగబోయే క్లస్టర్ సమావేశాల సమయాలను మార్చాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్వేటినగరంలో మీడియాతో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మొదలు పెట్టడం సరికాదన్నారు. పిల్లలకు 11.45 గంటలకే భోజనం అందించి, గంట వ్యవధిలో 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉండే క్లస్టర్ స్కూల్‌కి ఉపాధ్యాయులు వెళ్లడం, భోజనానికి కూడా సమయం కేటాయించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. క్లస్టర్ సమావేశ సమయాల్లో ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని ఉపాధ్యాయుల పక్షాన ఆందోళన వ్యక్తం చేశారు.

మహనీయుడు సంజీవయ్య



చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేశం గర్వించదగ్గ మహనీయుడు దామోదరం సంజీవయ్య అని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంజీవయ్య జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహ్మాన్ మాట్లాడుతూ.. సంజీవయ్యను ఆదర్శంగా తీసుకుని సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య, డీవీఎంసీ సభ్యులు రవీంద్ర నాయక్, మునస్వామి, రాజ్‌కుమార్ ప్రసంగించగా, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, డీఈవో వరలక్ష్మి, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర మిషన్‌లో వెనుకబడ్డాం

88పాయింట్లతో 25వ స్థానంలో నిలిచిన చిత్తూరు



చిత్తూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖలు చేపట్టిన స్వచ్ఛాంధ్ర మిషన్‌లో చిత్తూరు జిల్లా పూర్తిగా వెనుకబడింది. శుక్రవారం స్వచ్ఛాంధ్ర మిషన్ అమలు తీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా సంబంధిత కార్యక్రమాల అమలులో జిల్లాలు సాధించిన ర్యాంకులను ప్రకటించారు. మున్సిపల్ పట్టణాలు, నగరాలు, గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటింటి నుంచీ చెత్త సేకరణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్స్, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ తదితర 14 ప్రాధాన్యతా అంశాలను తీసుకుని అన్నింటికీ కలిపి 200 పాయింట్లు నిర్ణయించింది ప్రభుత్వం. ఈ 200 పాయింట్లకు గానూ జిల్లాలు సాధించిన పాయింట్లను బట్టి ర్యాంకులు నిర్ణయించింది. 26 జిల్లాలతో కూడిన ఈ జాబితాలో చిత్తూరు జిల్లా 88 పాయింట్లతో 25వ స్థానంలో నిలిచింది.మొదటి ర్యాంకు సాధించిన ఎన్టీయార్ విజయవాడ జిల్లాకు 129 పాయింట్లు రాగా దానికీ చిత్తూరు జిల్లాకు నడుమ తేడా ఏకంగా 41 పాయింట్లు వుండడం గమనార్హం. రాయలసీమ విషయానికొస్తే 122 పాయింట్లతో అనంతపురం జిల్లా మొదటి స్థానంలోనూ, 120 పాయింట్లతో అన్నమయ్య జిల్లా రెండవ స్థానంలోనూ, 118 పాయింట్లతో కడప జిల్లా మూడవ స్థానంలోనూ నిలవగా తిరుపతి జిల్లా 111 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది.

బ్యాంకుల్లో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

● లేదంటే మార్చి 24, 25 తేదీల్లో సమ్మె: యూఎఫ్‌బీయూ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో పెండింగ్ సమస్యలు పరిష్కరించకుంటే మార్చి 24, 25 తేదీల్లో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ అధ్యక్షుడు టి.శేఖర్, కార్యదర్శి పి.విజయ్‌భాస్కర్ వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక స్టేట్‌బ్యాంకు (ఎస్బీఐ) మెయిన్ బ్రాంచ్ ఎదుట యూఎఫ్‌బీయూ ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల ఉద్యోగులతో కలిసి ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. బ్యాంకుల్లో తగిన నియామకాలు చేపట్టాలని, ఉద్యోగాల ఔట్‌సోర్సింగ్‌ను నిలుపుదల చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే మార్చి 3న పార్లమెంటు ఎదుట, దేశవ్యాప్తంగా 24, 25 తేదీల్లో ధర్నా చేపడతామన్నారు. నాయకులు గంగిరెడ్డి, ఆర్.అనిల్‌కుమార్, ఏకే శ్రీహరి, మునిరెడ్డి, యోగేష్, ప్రభుత్వ, సహకార, గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

చిత్తశుద్ధి, ఏకాగ్రతతో బస్సులు నడపాలి



డ్రైవర్లను సత్కరిస్తున్న డీపీటీవో జగదీష్ తదితరులు

● ఆర్టీసీ డ్రైవర్లకు డీటీసీ, డీపీటీవో సూచన

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చిత్తశుద్ధి, ఏకాగ్రతతో బస్సులు నడపాలని ఆర్టీసీ డ్రైవర్లకు డీపీటీవో జగదీష్, డీటీసీ నిరంజన్‌రెడి సూచించారు. శుక్రవారం చిత్తూరు ఆర్టీసీ-2 డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీటీసీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తే 80 శాతం రోడ్డు ప్రమాదాలు జరగవన్నారు. అనంతరం ఆర్టీసీలో ప్రమాదాలు లేకుండా వాహనాలు నడిపిన డ్రైవర్లను సత్కరించారు. డీసీహెచ్ఎస్ ప్రభావతి, పీవో షాజాద్, డ్రైవర్లు, కండక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మీకు అండగా ఉంటాం

● ఏనుగు దాడిలో మృతిచెందిన రాకేష్ కుటుంబానికి మంత్రి లోకేశ్ భరోసా



చంద్రగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏనుగు దాడిలో మృతిచెందిన చంద్రగిరి మండలం మామిడిమానుగడ్డ వాసి, కందులవారిపల్లె పంచాయతీ ఉపసర్పంచ్ రాకేష్‌చౌదరి కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. రాకేష్ కుటుంబ సభ్యులు శుక్రవారం ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే రాకేష్ మృతి చెందడం తనను కలిచివేసిందని లోకేశ్ వారితో అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. రాకేష్ కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. వారి కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు.

నేడు ఆర్టీసీ డ్రైవర్లకు నగదు పురస్కారాలు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మసోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఆర్టీసీ తిరుపతి డిపో గ్యారేజీ ఆవరణలో 36 మంది డ్రైవర్లకు ప్రమాద రహిత సర్వీసు నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. ముఖ్య అతిథులుగా ఆర్టీవో మురళీమోహన్, డీపీటీవో నరసింహులు హాజరుకానున్నారు. వీరి చేతుల మీదుగా అత్యధిక ప్రమాద రహిత సర్వీసు గలిగిన జిల్లాస్థాయిలో ముగ్గురిని, డిపో స్థాయిలో 33మంది డ్రైవర్లను సత్కరించనున్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేష్ నాయక్, పొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





జస్టిస్ వెంకటేష్ నాయక్ - వరదరాజుల రెడ్డి


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.77 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,203

తలనీలాలు సమర్పించినవారు: 21,793






ప్రకృతి ఒడిలో సదాశివుడు

● అటు ఆధ్యాత్మికత..ఇటు ప్రకృతి రమణీయత

వడమాలపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధమైన జలపాతాలు, కొండ కోనల్లో సదాశివుని ఆలయం ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. వడమాలపేట సమీపంలోని సదాశివకోనలో వెలసిన ఈ ఆలయం దేవదాయ శాఖ పరిధిలో ఉంది. చుట్టూ ప్రకృతి అందాలు పరుచుకోవడంతో పర్యాటక కేంద్రంగా కూడా ఆలయప్రాంతం భాసిల్లుతోంది. పర్వదినాల్లో సమీప పరిసరాల నుంచే కాదు తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తులు సైతం ఇక్కడకు వస్తుంటారు. జలపాతంలో స్నానమాచారించి స్వామివారిని దర్శించుకుంటారు. జలపాత స్నానం చేశాక తడిదుస్తులతో ప్రదక్షిణ చేసి స్వామిని దర్శిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని దంపతులు విశ్వసిస్తారు. సదాశివకోన సమీపంలోనే కామాక్షి అమ్మవారి కోన ఉంది. మహామునులు పౌర్ణమి అమృత ఘడియల్లో జలపాత స్నానం చేసి గుహ ద్వారా శ్రీకాళహస్తిలోని వాయులింగేశ్వరుడ్ని దర్శించేవారని ఐతిహ్యం. శివరాత్రి, చిత్రాపౌర్ణమి, నవరాత్రులు,పౌర్ణమి తదితర వేడుకలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

మహాశివరాత్రి ఏర్పాట్లు

శివరాత్రి సందర్భంగా చైర్మన్ జయచంద్రన్ ఆధ్వర్యంలో ఆలయాన్ని సుందరంగా అలంకరిస్తున్నారు. వేకువజామున లింగోద్భవ అభిషేకం అనంతరం సర్వదర్శనానికి భక్తులను అనుమతిస్తారు. సులభ దర్శనం కోసం క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. వ్యయ ప్రయాసలతో చేరుకునే భక్తులకు భోజన వసతి కల్పిస్తున్నారు. వడమాలపేట, పుత్తూరు, ఏర్పేడు మండలాల అన్నదాన సమాజాలు ఈ సేవలో తరిస్తాయి.





సదాశివకోనలో శివాలయం



సదాశివకోన జలపాతం



అమ్మవారి కోన జలపాతం



ఆలయానికి ఇలా వెళ్లాలి..

- వడమాలపేటకు సమీపంలో రామసముద్రం బైపాస్ నుంచి ఎనిమిది కిలోమీటర్లు కాలినడక మార్గం
- పుత్తూరు నుంచి బస్సుల ద్వారా నాగిలేరు, అక్కడ నుంచి కోనకు ఆరు కిలోమీటర్లు నడకమార్గం.
- ఏర్పేడు మండలం పాయల్ సెంటర్ నుంచి జీపులు, ట్రాక్టర్లు, మోటర్ బైక్‌ల ద్వారా 12 కిలోమీటర్లు ప్రయాణించాలి.

రాయలు నాటి శాసనం

సదాశివకోనలో బండమీద క్రీ.శ. 1554 నాటి శాసనం కనిపిస్తుంది. సదాశివకోనలో చెరువు తవ్వించిన అంశం, గుడిమల్లం పరశురామేశ్వరుడికి సంబంధించిన దానం ఈ శాసనంలో లిఖితమై ఉంది. శ్రీవీరప్రతాప వీర సదాశివదేవరాయలు తరఫున స్థానిక అధికారి(కార్యకర్త)గా పనిచేస్తున్న నరసింహ ఈ శాసనాన్ని వేయించారు. పాయల్ సెంటర్‌కి 15 కిలోమీటర్ల దూరంలో అడవిలో అమ్మవారి కోనతో ఒక బండమీద ఈ శాసనం ఉంది. తెలుగులో ఉన్న ఈ శాసనం మీది అక్షరాలు కనుమరుగవుతున్నాయి. దీని విలువ తెలియక రంగులు పూసేస్తున్నారు.



అమ్మవారి కోన లో బయల్పడిన పురాతన శాసనం

ఐదు రోజుల్లో రుయా రూపురేఖలు మారాలి

● ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ వెంకటేశ్వర్

● అత్యవసర విభాగం పనితీరుపై అసంతృప్తి

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'ఆస్పత్రిలో రోగులకు మౌలిక వసతులు కల్పించేది ఇలాగేనా... ఏసీలు పనిచేయడం లేదు.. లైట్లు కూడా వేయకుండా చీకటి గుహను తలపించేలా ఆస్పత్రిని మార్చేశారు.. అత్యవసర విభాగం ఇంత అధ్వానంగా ఉంటే మిగిలిన వాటి పరిస్థితి ఏమిటి' అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ రుయా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రుయాస్పత్రిని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు మూడు గంటల సేపు ప్రతి విభాగాన్నీ పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులను పరిశీలించారు. మొదటగా అత్యవసర విభాగాన్ని పరిశీలించారు. కనీసం లైట్లు కూడా వేయకుండా రోగులకు వైద్య సేవలు అందిస్తుండటం, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అధికారులపై మండిపడ్డారు. వెంటనే అత్యవసర విభాగాన్ని మెరుగుపరిచే విధంగా చర్యలు చేపట్టి ఐదు రోజుల్లో రూపు రేఖలను పూర్తిగా మార్చాలన్నారు. అక్కడి నుంచి ఐసీయూ, ఆర్ఐసీయూ వార్డులను పరిశీలించారు. పనిచేయని ఏసీలు, ఫ్యాన్లు, లైట్లు ఉండకూడదని, విరిగిన మంచాలు, కుర్చీలు, కిటికీలు, తలుపులు వంటివి కూడా ఎక్కడా కనిపించకూడదని అన్నారు. అక్కడి నుంచి ఓపీ కేంద్రానికి వెళుతున్న క్రమంలో పాండూరుకు చెందిన జగ్గయ్య అనే రోగిని వారి కుటుంబ సభ్యులు స్ట్రెచర్‌పై నెట్టుకువెళుతుండటాన్ని గుర్తించారు. రోగులను ఇలాగే గాలికి వదిలేస్తారా.. తీసుకువెళ్లేందుకు సిబ్బంది లేరా అంటూ ఆయన వైద్యులను ప్రశ్నించారు. రోగులను ఇలా వైద్య పరీక్షలకు, ఓపీకి స్ట్రెచర్‌పై తీసుకువెళ్లకుండా అన్నీ ఒకే దగ్గర సమకూర్చే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ల్యాబ్‌ను పరిశీలించి, ఏ రోజు పరీక్షల ఫలితాలు అదే రోజు అందించాలని, ఆలస్యం చేస్తే సహించేది లేదని అన్నారు. ఎంఆర్‌పై స్కానింగ్, జనరిక్, మందుల దుకాణాన్ని పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న రోగుల సహాయకుల భవనాన్ని పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, న్యూ సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో ఎక్కడపడితే అక్కడ ఉద్యోగ సంఘాల క్యాలెండర్లు ఉండటంపై అసహనం వ్యక్తం చేస్తూ వాటి స్థానంలో సమాచార పోస్టర్లను అంటించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కనకనరసారెడ్డి, రుయా సూపరింటెండెంట్ రవిప్రభ, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ, ఏఆర్ఎంవో హరికృష్ణ, ఏపీఎంఐసీడీసీ ఈఈ శివరామిరెడ్డి, హెచ్‌డీఎస్ సభ్యులు ఖాజా మొహిద్దీన్, సందీప్ పాల్గొన్నారు.



స్ట్రెచర్‌పై తీసుకువెళుతున్న రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

'జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కసరత్తు చేస్తున్నాం. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఇదే విషయమై ప్రధానంగా వినతులు వచ్చాయి. ఇబ్బడిముబ్బడిగా నోషనల్ ఖాతాలోకి వెళ్లిన హక్కుదారుల ఆస్తులకు శాశ్వత పరిష్కారం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం' అని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ అన్నారు. ఇంకా పలు విషయాలపై ఆయనతో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కసరత్తు

● తిరుపతి ఆర్డీవో రామ్మోహన్



? రెవెన్యూ సదస్సుల్లో ఎలాంటి ఫిర్యాదులొచ్చాయి

! తిరుపతి డివిజన్ పరిధిలో నెల రోజులపాటు నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకున్నారు. ఎక్కువగా ఆర్వోఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) కేసులు వచ్చాయి. అంటే పట్టాదారు పాసు పుస్తకాలు ఆన్‌లైన్లో కావాలని, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, దారిలేక ఇబ్బందులు పడుతున్నామని, సర్వే సమస్యలు వంటివి వచ్చాయి. వాటిని జేసీ లాగిన్‌లో పెట్టాం.

? భూ కబ్జాలపై ఫిర్యాదులు చేశారా

! భూకబ్జా అంటే ఎలాంటి డాక్యుమెంటు లేకుండా వేరొకరి స్థలాన్ని ఆక్రమించుకోవడం. అయితే సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తే ఒకే స్థలానికి ఇద్దరు, ముగ్గురు మాదంటే మాదంటూ డాక్యుమెంట్లు తీసుకొస్తున్నారు. అదేవిధంగా కుటుంబ సభ్యులే భాగపరిష్కారం సక్రమంగా చేసుకోని వారు వస్తున్నారు. వీటిని భూకబ్జా అని అనలేం. ఇరువురి డాక్యుమెంట్లను పరిశీలించి, క్షేత్రస్థాయి సందర్శన, సర్వేతో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

? 22ఏ సమస్యకు పరిష్కారం జరిగేనా

! ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, దేవదాయ శాఖవారు కొన్ని సర్వే నంబర్లను గ్రామాల వారీగా నిషేధిత జాబితాలో చేర్చుతూ (22ఏ) 2007లో ఆయా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లకు పంపారు. ఆ జాబితాలో పొరబాటున ఎవరి ఆస్తులైన నమోదైవుంటే త్వరలోనే వాటికి విముక్తి కలుగనుంది. గతంలో రిజిస్టరైన ఆస్తులు ఆ తర్వాత కాలేదంటే ప్రధాన కారణం 22ఏ. పట్టాల్యాండ్‌ను పొరబాటునపెట్టినా, మాజీ సైనికుల కోటా కిందనో, 1954 ముందు చుక్కల భూమి ఉన్న కేసుల్లో ఎన్వోసీలు ఇచ్చివుంటే వాటికి త్వరలోనే 22ఏ నుంచి తొలగించేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

? నోషనల్ ఖాతాలోకి ఇబ్బడిముబ్బడిగా యజమానుల ఆస్తులు వెళ్లడమేంటి

! చంద్రగిరి నియోజకవర్గంలో ఇవి ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా పాకాల పరిధిలో కొన్ని గ్రామాలు నోషనల్ ఖాతాలో ఉన్నాయి. ఒక రైతుకు మ్యానువల్‌గా ఉన్నటువంటి 1బీ, అడంగల్‌ను ఆన్‌లైన్ చేయమని 2010-11లో చెప్పారు. చాలా మంది రైతులకు డాక్యుమెంట్ లేకపోవడమో, మ్యుటేషన్ చేసుకోవడంలో లింక్ డాక్యుమెంట్ లేకపోవడం, 1బి అడంగల్ దొరక్కపోవడం వలన టెంపరరీగా ఒక నెంబరు ఇచ్చివుంటారు. అదే నోషనల్ ఖాతా. కానీ భూమి వాళ్ల స్వానుభవంలోనే ఉంటుంది. ఇప్పుడు దానిని రెగ్యులర్ చేయడానికి దరఖాస్తులు వస్తున్నాయి. వాటిని పరిశీలించి, జేసీకి నివేదిక ద్వారా వివరించాం.

? పేరెంట్స్ ప్రొటెక్షన్ చట్టం అమలు ఎలా ఉండనుంది

! ఇది పాతదే. తల్లిదండ్రుల సంరక్షణ చట్టం 2007లో సెక్షన్ 23 ప్రకారం పేరెంట్స్‌ను పట్టించుకోని పిల్లలకు వారు పంచిచ్చిన ఆస్తులను తిరిగి తల్లిదండ్రులకే హక్కులు కల్పించడమే ఈ చట్టం ఉద్దేశం. ఇది తల్లిదండ్రుల సంరక్షణ కోసం తీసుకొచ్చిన చట్టం. ఆదరణకు నోచుకోని తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే విచారించి ఆ ఆస్తిపై పిల్లల హక్కును రద్దు చేసి, రిజిస్ట్రేషన్ హక్కులు కూడా మార్చి వారికి అప్పజెబుతాం. తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత పిల్లలపై ఉంది.

? డివిజన్లో ఇసుక పాలసీ ఎలా నడుస్తోంది

! స్థానిక అవసరాలకు వాగులు, వంకలు, చెరువుల్లో దొరికే ఇసుక వాడుకోవచ్చు. మిషనరీ, టిప్పర్లు పెట్టి అడ్డగోలుగా దోచుకునేందుకు అనుమతి లేదు. ఇసుక తీసుకెళ్లేవారు పర్మిట్ తీసుకోవాల్సి ఉంటుంది. తిరుపతి డివిజన్‌కు సంబంధించి అవిలాల, కాటన్‌మిల్లు ప్రాంతంలో స్టాక్ పాయింట్లు ఉన్నాయి. అక్కడ కొనుగోలు చేసి తీసుకెళ్లవచ్చు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఔటర్ రింగురోడ్డు టూ పాపవినాశనం

● రూ.40కోట్లతో నాలుగు లేన్ల రహదారి

తిరుమల, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు రూ.40 కోట్ల తో ఔటర్‌రింగు రోడ్డు నుంచి పాపవినాశనంకు నాలుగులైన్ల రోడ్డు నిర్మాణానికి టీటీడీ పూనుకుంది. పాపవినాశనం తీర్థం, ఆకాశగంగ, జపాలి ఆంజనేయస్వామి ఆలయం, వేణుగోపాల స్వామి ఆలయాలకు వెళ్లాలంటే నందకం సర్కిల్ లేదా ఆక్టోపస్ భవనం ముందు నుంచి గోగర్భం డ్యాం మీదుగా వెళ్లాలి. గోగర్భం డ్యాం నుంచి పాపవినాశనం వరకు రెండులైన్ల రోడ్డు మాత్రమే ఉండటంతో వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విశేష పర్వదినాలు, వారాంతాల్లో సర్వదర్శన క్యూలైన్ ఆక్టోపస్ సర్కిల్ దాకా వ్యాపిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలతో సమస్యలు వస్తున్నాయి. ఇందుకు పరిష్కారంగా నాలుగు లేన్ల రహదారిని ప్రతిపాదించారు.

తొలి దశలో..

తొలిదశలో వాహనాలు గోగర్భం డ్యాం మీదుగా వెళ్లే అవసరం లేకుండా ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి క్షేత్రపాలకుని ఆలయం మీదుగా మఠాలు, డంపింగ్‌యార్డు, నేపాలి చెక్‌పోస్టుకు చేరుకునేలా రోడ్డు నిర్మాణం పనులు మొదలు పెట్టారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి మఠాల వరకు పాచికాల్వ ఉండటంతో వంతెన నిర్మించనున్నారు.

రెండో దశలో..

నేపాలి చెక్‌పోస్టు నుంచి ఆకాశగంగ వరకు ప్రస్తుతమున్న రెండు లైన్ల రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించే పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లను తొలగించి సర్వే చేస్తున్నారు. ఆకాశగంగ నుంచి అటవీ భూములు కావడంతో అనుమతులు కోరారు.



పాపవినాశన మార్గంలోని పార్వేటమండపం వద్ద రోడ్డు విస్తరణకు జరుగుతున్న సర్వే

పోలీసులమని చెప్పి నగలు ఎత్తుకెళ్లారు

భాకరాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోలీసులమని మాయ మాటలు చెప్పిన గుర్తు తెలియని వ్యక్తులు ఓ జంట వద్ద బంగారు నగలు ఎత్తుకెళ్లిపోయిన ఘటన శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలంలో చోటుచేసుకుంది. భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. రొంపిచెర్ల మండలం గెర్లపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం శెట్టి భార్య భారతితో కలిసి ద్విచక్ర వాహనంలో చిన్నగొట్టిగల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో ఎండపల్లెవారిపల్లె వద్దనున్న పెట్రోలు బంకు వద్ద వాహనాన్ని ఆపిన కొంతమంది తాము పోలీసులమని, బంగారు నగలు వేసుకుని ద్విచక్ర వాహనంలో తిరగడం ప్రమాదకరమని, నగలను తీసి భద్రంగా పెట్టుకోవాలని సూచిస్తూ ఒక పేపరు అందించారు. సుబ్రహ్మణ్యం శెట్టి తన చేతిలోని ఉంగరం, భార్య మెడలో ఉన్న బంగారు చైనును ఆ పేపర్‌లో చుట్టి పెట్రోలు ట్యాంకు కవర్‌లో పెట్టుకుంటూ ఉండగా తామే పొట్లం కట్టి ఇస్తామని తీసుకున్నారు. ఆ పొట్లాన్ని ట్యాంకు కవర్‌లో పెట్టినట్లు నటించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారు వెళ్లిపోయిన తర్వాత ట్యాంకు కవరును పరిశీలించిన సుబ్రహ్మణ్యం శెట్టి తాము మోసపోయినట్లు గ్రహించి భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. 34 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భాకరాపేట పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీరెడ్డిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జనసేన నేత కిరణ్‌రాయల్ ఫిర్యాదు మేరకు లక్ష్మీరెడ్డిపై తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తన ఫొటోలను లక్ష్మీరెడ్డి, వైసీపీ నేత పసుపులేటి సురేష్ మార్ఫింగ్ చేశారని కిరణ్‌రాయల్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మికి ఇవ్వాల్సిన రూ.35 లక్షలు ఇచ్చినా, మరో రూ.90 లక్షలు ఇవ్వాలని లేకపోతే పరువు తీస్తానని బెదిరిస్తోందంటూ కిరణ్‌రాయల్ ఫిర్యాదు చేశారు. దీనిపై సెక్షన్లు 308,(3), 351(2)తో పాటు బీఎన్ఎస్ యాక్టు 66(డి) ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

ఆర్టీసీలో డ్రైవర్ల కొరత



ఆర్టీసీ అధికారులతో సమీక్షిస్తున్న డీపీటీవో నరసింహులు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్ల కొరత తీవ్రంగా కనిపిస్తోంది. ఉన్న వారిలోనూ పలువురు సెలవు పెడుతుండడంతో పూర్తిస్థాయిలో బస్సులు రోడ్డెక్కే పరిస్థితి ఉండడం లేదు. ఈ క్రమంలో అధికారులు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించారు. తక్షణ చర్యలలో భాగంగా ఆన్‌కాల్ డ్రైవర్ల ద్వారా గట్టెక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయా డిపో మేనేజర్ల పరిధిలో ఆన్‌కాల్ డ్రైవర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని డీపీటీవో జి.నరసింహులు ఔత్సాహికులను కోరారు. శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్స్, ఫిట్‌నెస్‌లలో పాసైన డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

300మంది ఆన్‌కాల్ డ్రైవర్లకు అవకాశం

జిల్లాలోని 11డిపోల పరిధిలో ఆర్టీసీ సొంత బస్సులు 726 ఉన్నాయి. వీటిని సజావుగా నడపాలంటే 1,830మంది డ్రైవర్లు అవసరం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డ్రైవర్లు 1,701మంది. 129మంది తక్కువగా ఉన్నారు. అంతేకాకుండా అందుబాటులో ఉన్న డ్రైవర్లు కూడా అనివార్య కారణాలతో సెలవు పెడుతున్నారు. ప్రస్తుతం బస్సులన్నీ రోడ్డెక్కాలంటే 300మంది ఆన్‌కాల్ డ్రైవర్లు అవసరం. ఇప్పట్లో శాశ్వత డ్రైవర్ల నియామకాలు కనిపించడం లేదు కాబట్టి ఆన్‌కాల్ డ్రైవర్ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. 2014 తర్వాత ఆర్టీసీ డ్రైవర్ల నియామకం జరగలేదు. గడిచిన పదేళ్లలో డ్రైవర్ల ఉద్యోగ విరమణ, ఇతర కారణాలతో ఖాళీల సంఖ్య క్రమేణా పెరుగుతోంది.

బుక్‌స్టాల్‌పై దాడి కేసులో నిందితుల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం)ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి పుస్తక ప్రదర్శనలో విశాలాంధ్ర బుక్ స్టాల్‌పై దాడి ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి 41 నోటీసు ఇచ్చినట్లు అలిపిరి సీఐ నాగార్జునరెడ్డి శుక్రవారం చెప్పారు. 41 నోటీసు ఇచ్చిన వారిలో తుమ్మల ఓంకార్, కిరణ్‌కుమార్, సురేష్‌నాయక్ ఉన్నారన్నారు. వీరితో పాటు దాడిలో పాల్గొన్న రమేష్‌బాబు, మరో నలుగురి కోసం గాలిస్తున్నారు.

ఎర్రచందనం నిందితుడికి ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా విధించిన న్యాయమూర్తి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష.. రూ 6 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం తిరుపతి ఎర్రచందనం అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు విల్లుపురం జిల్లాకు చెందిన జయపాల్‌ను ముంగిలిపట్టు బీటు పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతుండగా గతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ ఆరు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అనంతరం నిందితుడ్ని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

18న దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమావేశం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో తీవ్రవాదం, నక్సలిజాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా ఈ నెల 18న తిరుపతి కేంద్రంగా దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమావేశం నిర్వహించనున్నారు. తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణా, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన డీజీపీలు, ఉన్నత స్థాయి అధికారులు హాజరుకానున్నారు. సంవత్సరానికి రెండుసార్లు జరిగే సమన్వయ కమిటీ సమావేశం ఈసారి తిరుపతి వేదికగా జరగనుంది. గతంలో 2021 నవంబరు 14న తిరుపతిలో ఈ సమావేశం జరిగింది.

సెటిల్‌మెంట్ రిజిస్టర్లలో దిద్దుబాట్లు మూడు వారాల్లోగా పూర్తిచేయాలి

● కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ వేదికపై జేసీ, డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వివిధ కోర్టుల్లో ఉన్న డీకేటీ, ప్రభుత్వ, వెబ్‌ల్యాండ్, దేవదాయ శాఖలకు సంబంధించిన భూముల సెటిల్‌మెంట్ రిజిస్టర్లలో దిద్దుబాట్లు మూడు వారాల్లోగా పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో సర్వేయర్లతో రీసర్వేపై సమీక్షించారు. రీసర్వేకి సంబంధించిన పెండింగ్ కేసులు ఏ మేర ఉన్నాయో గుర్తించాలన్నారు. జేసీ విద్యాధరి మాట్లాడుతూ.. ఇప్పటివరకు 13 గ్రామాల్లో ఎఫ్‌పీవోఎల్‌ఆర్ పూర్తయ్యిందని చెప్పారు. ప్రభుత్వ భూముల హద్దులు గుర్తించడంలో ఎలాంటి పొరపాట్లు జరక్కుండా సెటిల్‌మెంట్ రిజిస్టర్లు పూర్తి చేయాలన్నారు. ఇకపై రోజూ ఉదయం ఎనిమిది గంటలకు మండల సర్వేయర్లు, ఆర్‌ఎస్‌డీటీలు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో జూమ్ కాన్ఫరెన్స్ జరుగుతుందని చెప్పారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్ కుమార్, టాస్క్‌ఫోర్స్ సర్వేయర్లు గణేష్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సుల దిశగా కుప్పం డిపో



ఎలక్ట్రిక్ బ్యాటరీలను పరిశీలిస్తున్న పీఎస్‌ఎం తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్టీసీ డిపో ఎలక్ట్రిక్ బస్సుల దిశగా పయనిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు జనవరి నెల కుప్పం పర్యటన సమయంలో కుప్పం ఆర్టీసీ డిపోకు ఎలక్ట్రిక్ బస్సులు తీసుకొస్తానని, గ్రీన్ ఎనర్జీతో బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అడుగులు వేస్తున్నారు. తొలుత కుప్పంతో మొదలు పెట్టి రాష్ట్రమంతగా ఎలక్ట్రిక్ బస్సులతో ఆర్టీసీ డిపోలను భర్తీ చేసే ప్రక్రియలో భాగంగా ఆయన శుక్రవారం బెంగళూరులోని తకనాల్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ని సందర్శించారు. అక్కడి కంపెనీ ప్రతినిధులు, అధికారులతో సమావేశమ య్యారు. ఎలక్ట్రిక్ బ్యాటరీలు పనిచేసే విధానాన్ని పరిశీలించారు. ఆయనవెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

బడ్జెట్ ప్రతిపాదనలపై 20 వరకు వామపక్షాల నిరసన కార్యక్రమాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలను తిరస్కరించాలంటూ దేశవ్యాప్తంగా శుక్రవారం నుంచి ఈనెల 20వ తేదీవరకు వామపక్షాలు చేపట్టిన నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు ప్రసంగించారు. నిరుద్యోగ సమస్యను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని చెప్పారు. ఈనెల 18న సమస్యలపై చర్చించేందుకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు, నాయకులు సురేంద్రన్, బాలసుబ్రహ్మణ్యం, మణి తదితరులు పాల్గొన్నారు.

పేదలను రోడ్డున పడేయకండి: వైసీపీ



ధర్నాలో మాట్లాడుతున్న కరుణాకరరెడ్డి

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పేదలను రోడ్డున పడేయకండని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి కోరారు. చిత్తూరు పాత బస్టాండు దుకాణదారులకు మద్దతుగా శుక్రవారం వైసీపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో ఆయన ప్రసంగించారు. వైసీపీ.. అభివృద్ధిని అడ్డుకుంటోందని కూటమి నేతలు ఫ్లెక్సీలు పెట్టారని, తాము అభివృద్ధికి అడ్డుకాదని, పేదల కడుపులు కొడితే సహించేది లేదని హెచ్చరించారు. చిత్తూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి మాట్లాడుతూ.. బస్టాండులో దుకాణాలు పెట్టుకున్న పేద, బడుగు, బలహీనవర్గాల వారిని రోడ్డున పడేయడం సరికాదన్నారు. పూతలపట్టు వైసీపీ ఇన్‌చార్జి సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, గుడిపాల మండల అధ్యక్షుడు ప్రకాష్, నేతలు రాహుల్‌రెడ్డి, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌డీఎల్ సేవలను అడ్డుకున్న వెటర్నరీ విద్యార్థులు



సిటీ వెటర్నరీ ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారమూ కొనసాగింది. తాతయ్యగుంట సిటీ వెటర్నరీ ఆస్పత్రి, వర్సిటీలోని టీవీసీసీ, రాష్ట్రీయ పశువ్యాధి నిర్ధారణ లేబొరేటరీ (ఎస్‌ఎల్‌డీఎల్)ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవలు నిలిపేశారు. టీవీసీసీ వద్దకు చేరుకున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత ఓపీ సేవలు పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం నుంచి జీవో వచ్చే వరకు సమ్మె విరమించబోమని, అత్యవసర ఎమర్జెన్సీ సేవలకు ఆటంకం కలిగించబోమని వివరించారు. ప్రభుత్వం స్పందించకుంటే రానున్న రోజుల్లో ఎమర్జెన్సీ సేవలను సైతం బంద్ చేస్తామని తెలిపారు.

21న సినీ గేయ రచయిత సుద్దాల రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీన ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ తిరుపతికి రానున్నారు. సాయంత్రం ఐదు గంటలకు యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో 'శ్రమ కావ్య గానం' చేయనున్నారు. అశోక్‌తేజ రాసిన శ్రమ కావ్యంలోని పాటలను ఈ సందర్భంగా గానం చేస్తారు. సభలో సీఐటీయూ నేతలు నరసింగరావు, కందారపు మురళి పాల్గొంటారని నిర్వాహకులు మల్లారపు నాగార్జున తెలిపారు.

లక్ష్యానికి చేరువలో పీఎంఎంవై

● ఇవ్వాల్సింది రూ.660 కోట్లు .... ఇచ్చింది రూ.623 కోట్లు

విభాగం	లబ్ధిదారులు	రుణం (రూ.కోట్లలో)
శిశు విభాగం	6476	23.70
కిశోర్ విభాగం	11,655	179.47
తరుణ్ విభాగం	5090	419.83
మొత్తం	23,231	623.00

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):వ్యవసాయేతర, కార్పొరేటరేతర సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు రుణాలు అందించడానికి ప్రధానమంత్రి ముద్రాయోజన (పీఎంఎంవై) పథకాన్ని 2015 ఏప్రిల్ 8న కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, కొత్తగా పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారు, వ్యాపారాన్ని విస్తరించాలనుకునే వారు నిధుల పరంగా ఇబ్బంది పడకూడదని ఈ పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వరంగ బ్యాంకులే కాకుండా సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, చిన్న ఫైనాన్స్ బ్యాంకుల నుంచి కూడా ఎటువంటి హామీ లేకుండా రుణం పొందవచ్చు. చిత్తూరు జిల్లాలో ప్రధానమంత్రి ముద్రాయోజనకు బ్యాంకుల నుంచి చేయూత మెండుగా ఉంది.

● మూడు విభాగాల్లో...

ఈ పథకం కింద రూ.50 వేల నుంచి రూ.10లక్షల వరకు మూడు విభాగాల్లో రుణాలు ఇస్తున్నారు. శిశు విభాగంలో రూ.50వేలు, కిశోర్ విభాగంలో రూ.50వేల నుంచి రూ.5లక్షల లోపు, తరుణ్ విభాగంలో రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు మంజూరు చేయాలి. కేంద్ర ప్రభుత్వం 2024-25 ఆర్థికసంవత్సరం బడ్జెట్‌లో ఈ పరిమితిని రూ.20లక్షల వరకు పెంచింది.

● లక్ష్యానికి చేరువలో ...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో రెండునెలల్లో ముగియనుంది. ఇందుకోసం జిల్లాలో రూ.660 కోట్లు రుణాలు ఇవ్వాలని జిల్లా బ్యాంకర్ల సంఘం నిర్ణయించింది.జనవరి నాటికి 23,231 మందికి రూ.623 కోట్లు రుణం మంజూరు చేశారు. ఇప్పటికే 94శాతం పంపిణీ పూర్తిచేసిన బ్యాంకర్లు మార్చి ఆఖరినాటికి మిగిలిన రూ.37 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు.

● అవగాహన కల్పిస్తున్నాం



చిన్న వ్యాపారం కలిగివున్నా, నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనుకునే ఖాతాదారులు తమ సమీపంలోని బ్యాంకు శాఖను సంప్రదించవచ్చు. ఖాతాదారుల సిబిల్ స్కోర్ ఆధారంగా రుణం పొందేందుకు అవకాశం ఉంటుంది. రూ.10 లక్షల వరకు ఎటువంటి భద్రత లేకుండా వ్యాపార సామర్థ్యాన్ని బట్టి బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేయబడుతుంది. గతంలో తరుణ్ విభాగంలో రూ.10లక్షలు ముద్రా రుణం తీసుకుని, నిర్ణీత సమయంలో తిరిగి చెల్లించిన ఖాతాదారులకు రూ.20లక్షలు రుణం పొందేందుకు అవకాశం ఉంది. అర్హత కల్గిన ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

- ఎ. హరీష్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజరు, చిత్తూరు జిల్లా.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి రాహుకాలంలో వేదపండితులు పంచామృతాభిషేకాలు, పసుపు, కుంకుమ, గంధాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు, అమ్మవారి అభిషేక గంధం అందుకున్నారు.

పొలాలపై ఏనుగుల గుంపు దాడి

- వరి, మామిడి, అరటి పంటలకు నష్టం





ధ్వంసమైన పైపులైన్లు - విరిచేసిన మామిడి చెట్లు



తొక్కేసిన వరిపంట

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పొలాలపై ఏనుగుల గుంపు గురువారం అర్ధరాత్రి దాడి చేసింది. దీంతో వరి, మామిడి, అరటి పంటలకు నష్టం వాటిల్లింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలంలోని ఎగువ కంతల చెరువు గ్రామ సమీపంలో ఉన్న పొలాలపై ఏనుగుల గుంపు పడింది. గ్రామానికి చెందిన భాస్కర్ పొలంలో నీటి పైపులైన్లను ధ్వంసం చేశాయి. మునికృష్ణ, వెంకటేష్‌లకు చెందిన వరి పంటను తొక్కేశాయి. ఈశ్వరయ్య, ప్రకాష్, దేవేంద్ర, రాధలకు చెందిన మామిడి చెట్లను, కుమారస్వామికి చెందిన అరటి చెట్లను విరిచేశాయి. ఏనుగుల దాడులతో తీవ్రంగా నష్టపోయామని, పొలాలకు వెళ్లాలన్నా భయంగా ఉందని బాధిత రైతులు చెబుతున్నారు. అధికారులు తమకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.

వేద వర్సిటీలో భద్రేష్‌దాస్ స్వామి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఢిల్లీ అక్షరధామ్ నారాయణ సంస్థాన్‌కు చెందిన మహామహోపాధ్యాయ డాక్టర్ భద్రేష్‌దాస్ స్వామి తదితరులు పర్యటించారు. వేద వర్సిటీ వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తితో సమావేశమయ్యారు. వేద పఠనం విని ప్రశంసించారు. వేద విద్య బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో చేస్తున్న కృషిని వీసీ వివరించారు. అనంతరం విద్యార్థులు చేసిన చతుర్వేద మంత్ర పఠనాన్ని విన్న స్వామీజీలు వారి ప్రతిభను కొనియాడారు. విద్యార్థులందరూ ఒక్కసారి అక్షరధామ్‌ను సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో డీన్లు గోళి సుబ్రమణ్యశర్మ, తారకరామకుమారశర్మ, పవన్, ఉమేష్, బ్రహ్మచార్యులు పాల్గొన్నారు.

సరైన జీవన విధానంతో క్యాన్సర్ దూరం





5కే వాక్‌థాన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం, జీవన విధానం ద్వారా క్యాన్సర్ సంక్రమించకుండా చేయవచ్చునని, ముందుగానే గుర్తించడం, మెరుగైన చికిత్స ద్వారా ప్రాణం కాపాడుకోవచ్చని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ డేను పురస్కరించుకుని శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం 5కే వాక్‌థాన్, సైకిల్ ర్యాలీ నిర్వహించారు. దాదాపు 800మంది పాల్గొన్నారు. అతిథులు మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజల్లో చైతన్య కల్పించడానికి ర్యాలీ నిర్వహించడం సంతృప్తిగా ఉందన్నారు. బాల్యం నుంచే మెరుగైన జీవన విధానం అలవరుచుకోవాలని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని, క్రీడలను బడిఈడు నుంచి అలవాటు చేసుకోవాలని కోరారు. క్యాన్సర్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు స్క్రీనింగ్ సర్వేలు చేస్తున్నట్లు చెప్పారు. టాటా క్యాన్సర్ హాస్పిటల్ నిర్వాహకులు చేపడుతున్న అవగాహన, నివారణ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్యాన్సర్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్.ప్రశాంత్ డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

బెస్ట్ ఆర్కిటెక్ట్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న తారకరామ నాయుడు

తిరుపతి, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి) : ఎడ్జ్ ఇంటీరియర్స్ అండ్ ఇంజినీరింగ్స్ సంస్థ అధినేత తారకరామ నాయుడు (డిజైనర్ తారక్) బెస్ట్ ఆర్కిటెక్ట్, డిజైన్ అవార్డు అందుకున్నారు. మెరిట్ అవార్డ్స్ అండ్ మార్కెట్ రీసెర్చ్ (ఎంఏఎంఆర్) ప్రైవేట్ లిమిటెడ్ శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్ (ఐఐఏ) చైర్మన్ కృష్ణారావు జైసిమ్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డు అందజేశారు. తిరుపతికి చెందిన తారక్ ఆర్కిటెక్ట్, ఇంటీరియర్ రంగంలో అనతికాలంలోనే తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. బెంగళూరు, తిరుపతి నగరాల్లో ప్రముఖ సంస్థల నిర్మాణాలకు డిజైన్స్ చేస్తున్నారు. తారక్‌ను ఏపీ నుంచి బెస్ట్ ఆర్కిటెక్ట్ అవార్డుకు ఎంపిక చేశారు.

పద్మావతి వర్సిటీలో ఏప్రిల్ 21నుంచి అంతర్జాతీయ సదస్సు



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వీసీలు అప్పారావు, ఉమ, రిజిస్ట్రార్లు భూపతినాయుడు, రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ వేదికగా ఏప్రిల్ 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అప్లికేషన్స్ విత్ రేర్ ఎర్త్స్ అంశంపై ఎస్వీయూ ఫిజిక్స్ - పద్మావతి వర్సిటీ బయో టెక్నాలజీ - రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ సదస్సు చేపట్టనున్నాయి. దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పిస్తారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని ఆవిష్కరించారు. రేర్ ఎర్త్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్‌పీ.రెడ్డి, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాదరాజు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి రెండు రోజుల జైలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జ్యుడీషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పునిచ్చారు. ఈ ముగ్గురినీ గతంలో ఒకటికి రెండుసార్లు హెచ్చరించినా లెక్క చేయకుండా మళ్లీ మళ్లీ ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో దొరికారు. ఈ క్రమంలో సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన బయన్న, తిరుపతి రిక్షాకాలనీకి చెందిన నందగోపాల్, తిరుమల బాలాజీనగర్‌కు చెందిన కుమార్‌కు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్ కేసులో 12 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఒక్కొక్కరికి రూ.పది వేల వంతున రూ.1.20 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కల్తీ నెయ్యి కేసులో నిందితులకు రుయాలో వైద్య పరీక్షలు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో నిందితులైన రాజశేఖర్, పోమిల్‌జైన్, అపూర్వ, విపిన్‌జైన్‌కు శుక్రవారం సిట్ అధికారులు రుయాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. వీరిని సిట్ కస్టడీకి న్యాయస్థానం అనుమతించిన నేపథ్యంలో అలిపిరి, వెస్ట్ సీఐలు రామకిశోర్, మురళీమోహన్ వైద్య పరీక్షల నిమిత్తం 11.30 గంటలకు రుయా అత్యవసర విభాగానికి తీసుకొచ్చారు. సీఎంవో అన్వేష్ ఆధ్వర్యంలో నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించి అందరూ ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించారు. తిరిగి 11.50 గంటలకు తీసుకెళ్లారు.

ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేయాలి



సంఘీభావం తెలియజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో పీజీ ప్రవేశానికి చేపట్టిన ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఎస్వీయూలోని భవన్ ఎదుట శుక్రవారం వివిధ విద్యార్థి సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బండి చలపతి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, గిరిజన నవసమాజ్ నేత శివశంకరనాయక్, లా విద్యార్థి సంఘ నేత సుందర్రాజు, బీసీ విద్యార్థి సంఘ నేత తిరుమలేష్ మాట్లాడారు. పీజీ ప్రవేశానికి చేపట్టిన ఉమ్మడి పీజీ సెట్ వల్ల అడ్మిషన్ల సంఖ్య భారీగా తగ్గిందన్నారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఉమ్మడి పీజీ సెట్ నోటిఫికేషన్ వచ్చిన సమాచారం కూడా తెలియకపోతోందన్నారు. ఇందువల్ల విద్యార్థులు లేక యూనివర్సిటీల్లో అనేక విభాగాలు మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. యూనివర్సిటీలకే పీజీ అడ్మిషన్లు నిర్వహించుకునే అధికారమిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేయకపోతే యూనివర్సిటీల బంద్‌కు పిలుపునిస్తామన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచీ దశలవారీగా ఉద్యమాన్ని చేపడతామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అశోక్, ఏఐఎస్‌ఎఫ్ నేత ప్రవీణ్, ఎస్సీ, ఎస్టీ సెల్ నేత మురళి, నాయకులు చంద్రనాయక్, రాజు, విజయ్, మహేంద్ర, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి


సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ రెడ్డెప్ప

చౌడేపల్లె, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను స్థానిక ఎస్సీ హాస్టల్లో శుక్రవారం బ్యాంక్ రెడ్డెప్ప ఆధర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదరం సంజీవయ్యను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ సురేష్, చంద్ర, శేఖర్, వేణుగోపాల్, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్ణాటకలో రామకుప్పం యువకుడి ఆత్మహత్య

రామకుప్పం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం వీర్నమల సమీపంలోని బండకొత్తూరుతాండాకు చెందిన చరణ్ అనే యువకుడు కర్ణాటక రాష్ట్రం ముళబాగల్ సమీపంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు.. బండకొత్తూరుకు చెందిన నాగూనాయక్ కుమారుడు చరణ్ నాయక్(24)ఉపాధి కోసం కర్ణాటకకు వలస వెళ్లాడు. అక్కడ కేబుల్ గొయ్యిలు తవ్వే పనులు చేస్తూ జీవనం సాగించే వాడు. ఏమైందో ఏమో కానీ శుక్రవారం ముళబాగల్ సమీపంలోని ఓ తోటలో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

తీరని విషాదం.. గతంలో అన్న.. ఇప్పుడు తమ్ముడు

చరణ్‌నాయక్ ఆత్మహత్యతో నాగూనాయక్ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. నాగూనాయక్ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కొన్నేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇప్పుడు రెండో కుమారుడు కూడా ఆత్మహత్య చేసుకోవడంతో ఆ దంపతులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి


జడ్పీ బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేస్తున్న ఆర్డీవో భవానీ

పుంగనూరు, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పలమనేరు ఆర్డీవో భవానీ ఆదేశించారు. శుక్రవారం పుంగనూరు జడ్పీ బాలికోన్నత పాఠశాల, లినార్డు హైస్కూల్, దోబీకాలనీలోని అంగన్వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్నభోజనంలో నాణ్యత పాటించాలని, విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి ఉన్నతశ్రేణికి వచ్చేలా చూడాలని సూచించారు. 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ రాము, ఆర్ఐ ఫణికుమార్, ఎంఈవోలు చంద్రశేఖర్ రెడ్డి, రెడ్డెన్నశెట్టి, హెచ్ఎంలు తదితరులు ఉన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు


విద్యార్థులు తయారుచేసిన పోర్టుఫోలియో ప్రదర్శనలో అజిత్ మిస్త్రా

కల్లూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వృతి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని వృత్తి విద్యా పరిశీలనాధికారి అజిత్ మిస్త్రా తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల (పీఎంశ్రీ పాఠశాల)కు పరిశీలనాధికారిగా ఎంపికైన అజిత్ మిస్త్రా శుక్రవారం తనిఖీలు చేశారు. వృత్తి విద్య, రిటైల్ ప్రాక్టికల్స్‌కు సంబంధించిన వివిధ అంశాలపై హెచ్ఎం శ్రీవాణితో చర్చించారు. అనంతరం టెన్త్ విద్యార్థుల రికార్డులు, విద్యార్థులు తయారు చేసిన పోర్టు ఫోలియో ప్రదర్శన, వైవా మొదలగు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సుల్లో విద్యార్థులు సాధించిన ప్రగతిని పీఎంశ్రీ కేంద్ర కార్యాలయానికి పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయులు వెంకటేష్, శివశంకర్, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, రాజేంద్ర, వెంకటరమణారెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర్‌వికాస్ కమిటీల్లో జాప్యం తగదు


రొంపిచెర్ల అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న పీడీ వెంకటేశ్వరి

రొంపిచెర్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) మండలంలో కిశోర్ వికాస్ కమిటీల ఏర్పాటులో జాప్యం తగదని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరి సూచించారు. శుక్రవారం ఆమె రొంపిచెర్ల మండలంలో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించి అధికారులకు పలు అభివృద్ధి పనులపై సూచనలు ఇచ్చారు. రైతుభరోసా కేంద్రం, సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రం, కేజీబీవీ పరిశీలించారు. రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య నమోదు, పనితీరు, విధుల హాజరు వివరాలు ఆరాతీశారు. అంగన్వాడీ కేంద్రంలో, కేజీ బీవీలో అందించే భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ సత్యంరెడ్డి, పంచాయతీ సెక్రటరీ హరిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శరీషా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కదేవతల పూజలు



సోమల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం వల్లిగట్ల పంచాయతీ కొత్తపల్లె వ్యవసాయ క్షేత్రం వద్ద కొలుదీరిన అక్కదేవతల ఆలయం వద్ద శుక్రవారం పచ్చదేవర్లు కనుల పండుగా నిర్వహిం చారు. ఆసాదివారు, గురుస్వాములు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. వల్లిగట్ల, కొత్తపల్లె, కందూరు, గల్లావారి పల్లె తదితరగ్రామాల ప్రజలు పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలమనేరు, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి) : పలమనేరు విద్యుత్ డీఈ కార్యాలయ పరిధిలోని పలమనేరు రూరల్‌లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. వినియోగదారులు సహకరించాలని డీఈ చిన్నబ్బ కోరారు.

జేఈఈలో సదుం గురుకులం విద్యార్థి ప్రతిభ


విద్యార్థి లక్ష్మీనారాయణ

సదుం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు సదుంలోని ఎంజేపీ గురుకులం ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ఇంటర్ స్థాయి 14 ఎంజేపీ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులందరికంటే తమ పాఠశాలలో ఇంటర్ ఎంపీసీ చదువుతున్న లక్ష్మీనారాయణ జేఈఈ ఎంట్రెన్స్‌లో 77.98 శాతం మార్కులతో మొదటి స్థానంలో నిలిచాడని వివరించారు. విద్యార్థి లక్ష్మీనారాయణను శుక్రవారం ఆయనతోపాటు కళాశాల అధ్యాపకులు అభినందించారు.

సీపీఐ కన్వీనర్‌గా చెన్నకేశవులు




చెన్నకేశవులు, కో-కన్వీనర్ బుర్రమంజునాథ్ బాబు

పలమనేరు, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): పలమనేరు నియోజకవర్గ సీపీఐ కన్వీనర్‌గా చెన్నకేశవులు, కో కన్వీనర్‌గా బుర్రామంజునాథ్ బాబు నియమితులయ్యారు. పలమనేరు సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వీరిని నియమించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజుతో కలిసి వారు మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు అర్హులైన నిరుపేదలకు గ్రామాల్లో 3సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2సెంట్లు నివేశస్థలాలను కేటాయించాలని కోరారు.

రేపు ఉచిత కంటి చికిత్స శిబిరం

రామకుప్పం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల ఆస్పత్రి, రామకుప్పం వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రామకుప్పంలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ పెద్దలు సీతాపతి తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

రేపు ఉచిత క్యాన్సర్ పరీక్షలు

పుంగనూరు, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న పుంగనూరులో వారాహి గ్రూప్స్ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ వ్యాధి పరీక్షలను బెంగళూరుకు చెందిన వైదేహి ఆస్పత్రి వైద్యులచే నిర్వహించనున్నట్లు వారాహి ఫౌడేషన్ ప్రతినిధి హేమంత్ రాయల్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్థానిక లినార్డు మున్సిపల్ పాఠశాల ఆవరణలో గుండె, కిడ్నీ, డయాలసిస్, ప్లాస్టిక్ సర్జరీ, యూరాలజీ, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాపు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి


సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న మంజునాథ్

కుప్పం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో కాపు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని టీడీపీ కుప్పం నియోకవర్గ విస్తరణ కమిటీ సభ్యుడు ఎం.మంజునాథ్ ముఖ్య మంత్రి చంద్రబాబును కోరారు. ఉండవల్లిలోని నివాసంలో ఆయన ముఖ్యమంత్రిని కలిశారు. కుప్పంలోని చిరు వ్యాపారస్తుల్లో ఒకరైన నిరుపేద కుటుంబ సభ్యుడు వేలు క్యాన్సర్ బారిన పడ్డారని, వైద్యం కోసం ఆయనకు రూ.9 లక్షలు వ్యయమైందని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా వేలు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. పరిశీలించి తగిన న్యాయం చేస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లు మంజునాథ్ తెలిపారు.

లక్ష్మీ నరసింహుడికి విశేష పూజలు

కల్లూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభి షేకాలు, అర్చనలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన స్వామివారు భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. అర్చకులు అనంతకుమారాచార్యులు, ఉభయదారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మరిన్ని సౌకర్యాలు కల్పించాలి


ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆస్పత్రి కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మరిన్ని వసతులు కల్పించాల్సిన అవసరముందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరులోని తన కార్యాలయంలో ఆస్పత్రి కమిటీ, ఆస్పత్రి సూపరింటెండెంట్, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. రోగులు, వారి సహాయకులకు ప్రస్తుతం అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకొన్నారు. ఆక్సిజన్ పైప్‌లైన్, లిఫ్టు ఏర్పాటు, 10 స్ట్రెచర్లు, బ్యాక్ రెస్ట్ బెడ్లు, రోగుల సహాయకుల కోసం బెంచీల ఏర్పాటు, దోమల బెడద లేకుండా కిటికీలకు మెష్‌లు, 34 పరుపులతో పాటు కంప్యూటర్ ప్రింటర్లు అవసరమని సూపరింటెండెంట్ మమతారాణి ఆయనకు వివరించారు. తక్కువ ధరకు నాణ్యమైన ఆహారం అందేలా క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న నిధులతో ప్రాధాన్యతా క్రమంలో వసతులు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. మిగిలిన సౌకర్యాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషిచేస్తానని తెలియజేశారు. అలాగే దాతల సహకారంతోను మరికొన్నింటిని పూర్తి చేసుకొందామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు, సుధాకర్, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో దళితులకు ప్రాధాన్యత ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు సీతారామ్

గుడుపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యల పరిష్కారం కోసమే విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీతారామ్ తెలిపారు. శుక్రవారం స్త్రీశక్తి భవనంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల్లో దళితులకు తగిన ప్రాధాన్యత కల్పించడంలేదని పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన గోకులం షెడ్‌లు దళితులకు కొన్ని మాత్రమే ఇచ్చారని వాపోయారు. ఎంపీడీవో రాధాక్రిష్ణ స్పందిస్తూ ఇక నుంచి అలా జరగదని హామీఇచ్చారు. డీకేటీ భూముల సమస్యలను, దళితులకు కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని, శ్మశాన సమస్యలు పరిష్కరించాలని సభ్యులు కోరారు. తప్పకుండా పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ సీతారామ్ తెలియజేశారు. ఆర్ఎంపీ వైద్యులను కట్టడి చేయాలని సభ్యులు విన్నవించగా విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. ఈ కార్య క్రమంలో పలు శాఖల అధికారులు, సర్పంచ్ నారాయణ, కమిటీ అధ్యక్షులు రామచంద్ర, కన్వీనర్ బేటరాయప్ప, కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, రామప్ప, చంద్రశేఖర్, నాగభూషణం పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య పుంగనూరు మండల మీట్


ఎంపీడీవో కార్యాలయం ఎదుట పోలీసుల బందోబస్తు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండల సాధారణ సమావేశం శుక్రవారం పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిధిలోని చెరువుల్లో మట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తూ రియల్ఎస్టేట్ వ్యాపారాలకు వాడుకుంటున్నా అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. రైతులు తమ పొలాలకు మట్టి తరలిస్తుంటే వీఆర్వోలు అడ్డుకోవడం తగదన్నారు. ఎంపీటీసీ నాగభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించరాదన్నారు. సింగిరిగుంట, చంద్రమాకులపల్లె పంచాయతీల సర్పంచులు అంజప్ప, ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటికి విద్యుత్ సరఫరా చేయడంలో విద్యుత్‌శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బోడేవారిపల్లె సర్పంచ్ కేశవులు మాట్లాడుతూ ఈడిగపల్లె ప్రభుత్వ హై స్కూల్‌కు ప్రహరీ, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి, పథకాలను వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో లీలామాధవి, ఈవోపీఆర్డీ నారాయణ, వైస్ ఎంపీపీలు సరోజమ్మ, ఈశ్వరమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు. సీఐ శ్రీని వాసులు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్డు మరమ్మతుల పనులు చేయించాలి


చల్లా రామచంద్రారెడ్డికి సమస్యలు తెలుపుతున్న టీడీపీ కార్యకర్తలు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం రొంపిచెర్లలో ఆయన ఇంటికి సదుం, పులిచెర్ల, పుంగనూరు, రొంపిచెర్ల మండలాలకు చెందిన పలువురు వచ్చి వారి సమస్యలు వివరించారు. పుంగనూరు మండలంలో పుంగనూరు- ముల్‌బాగళ్, నేతిగుంట పంచాయతీ ఎర్రగుంటపల్లె-ఆవులవారిపల్లె, 150 మైళ్ల నుంచి చంద్రమాకులపల్లె రోడ్డు మార్గాలు మరమ్మతులు చేయాలని నాయకులు సీవీ రెడ్డి, మోహూరు రమేష్, ఎం.మోహన్‌రెడ్డి, లాయర్ వెంకటమునియాదవ్‌లు కోరారు. కలెక్టరుతో సంప్రదించి సమస్య పరిష్కరిస్తామని చల్లా రామచంద్రారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇబ్రహీంఖాన్, రొంపిచెర్ల మండల టీడీపీ అధ్యక్షుడు ఉయ్యాలరమణ. సదుం శ్రీనివాసులురెడ్డి, ధనంజయనాయుడు, మురళీనాయుడు, రఘునాథ, మదన మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలం స్వాధీనం


స్థలాన్ని కొలతలు తీస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి, సిబ్బంది

పలమనేరు, ఫిబ్రవరి14 : పలమనేరు జేఎస్.నగర్‌లో ఓ రియల్టర్ మున్సిపాలిటీకి కేటాయించిన స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. మున్సిపాలిటీలోని జేఎస్.నగర్ 3.9 ఎకరాల స్థలంలో దశాబ్దం క్రితం రియల్టర్ లే అవుట్ వేశారు. నిబంధనల మేరకు లేఅవుట్‌లో 10 శాతం అంటే 39 సెంట్ల స్థలాన్ని ప్రజోపయోగం కోసం మున్సిపాలిటీకి రియల్టర్ కేటాయించారు. లే అవుట్ వేసి దశాబ్ద కాలం దాటిపోవడంతో మున్సిపాలిటీకి రియల్టర్ కేటాయించిన స్థలం కొంత ఆక్రమణకు గురైంది. స్థానికుల ఫిర్యాదుతో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి ఇందుకుమారిని తన సిబ్బందితో కలిసి శుక్రవారం కొలతలు తీసి 39 సెంట్ల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా అక్కడ ఒక ఉద్యానవనం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.

కార్మికులకు వైద్యపరీక్షలు

సోమల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కందూరు సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు శుక్రవారం డాక్టర్ నీలిమ, డాక్టర్ విజయలక్ష్మి వైద్యపరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి జయశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. కార్మికులు ఏడాదికి రూ.1500లు చెల్లించి రూ.5 లక్షల ఆరోగ్య జీవిత బీమా సౌకర్యం పొందవచ్చునని తెలిపారు.

రైతులు గుర్తింపు కార్డు పొందాలి


రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఏడీఏ శివకుమార్

కల్లూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భూమి కలిగిన రైతులం దరూ ఒక ప్రత్యేక రైతు గుర్తింపు కార్డును తప్పక పొందాలని పుంగనూరు ఏడీఏ శివకుమార్ తెలిపారు. పులిచెర్ల మండలం మంగళంపేట, పులిచెర్ల రైతు సేవా కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని గుర్తింపు కార్డు పొందాలని తెలియ జేశారు. ప్రభుత్వ పథకాలకు ఈ కార్డు తప్పనిసరి అని వివరించారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి : డీపీవో


కల్లూరులో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో సుధాకర్‌రావు

కల్లూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణ ద్వారా తడిచెత్తను, పొడిచెత్తను వేరుచేసి వాటి నుంచి సంపదను సృష్టించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సుదాకర్‌రావు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు మేజర్ పంచాయతీలో శుక్రవారం డీపీవో పర్యటించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. తర్వాత చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రానికి తక్షణం ప్రహరీ ఏర్పాటుచేయాలన్నారు. ఇంటి పన్నులు, నీటి పన్నులు వంద శాతం వసూలు చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి లైట్లు సమస్య తలెత్తకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి నాగరాజును ఆదేశించారు. అంతకుముందు మంగళంపేట పంచాయతీలో డీపీవో పర్యటించారు. మురుగునీటి కాలువ సమస్యపై గ్రామానికి చెందిన ఖాదర్‌బాషా ఇటీవల ఫిర్యాదు చేసిన నేపథ్యంలో తహసీల్దార్ జయసింహ, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్‌బాబుతో కలిసి ఆ కాలువను పరిశీలించారు. దేవళంపేట సచివాలయాన్ని తనిఖీచేశారు. పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ మధు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దంపతులపై దాడి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందుకు నీటిని వదిలారని దంపతులపై దాడి చేశారు. బాధితుల కథనం మేరకు.. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కొత్తకురప్పల్లెకు చెందిన మంజునాథ్ నూతనంగా ఇల్లు నిర్మించుకుని గృహప్రవేశం చేశారు. తన ఇంటిలోని వ్యర్థపు నీళ్లు సీసీ రోడ్డు మీదుగా పక్కనున్న భాస్కర్ ఇంటి ముందుకు వెళ్లాయి. దీంతో భాస్కర్ కుటుంబసభ్యులు అనిత, గంగోజీ, అల్లుడు సాంబశివలు కలిసి మంజునాథ్, లలితకుమారిలపై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. గాయపడిన మంజునాథ్, లలితకుమారిలను కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పుంగనూరు సమస్యలు పరిష్కరించాలి


చంద్రబాబును కలసిన వెంకటరమణరాజు

పుంగనూరు, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని పలు సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు టీడీపీ పుంగనూరు మాజీ ఇన్‌చార్జి ఎం.వెంకటరమణరాజు తెలిపారు. శుక్రవారం తాడేపల్లెలో సీఎం క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబును కలిశారు. పట్టణంలో డ్రైనేజీ కాల్వలను ఏర్పాటు చేయాలని, కాల్వల పక్కన ఆక్రమణలు తొలగించాలని, టిడ్కో ఇళ్లను నిజమైన లబ్ధిదారులకు అందించాలని కోరినట్లు వివరించారు. అలాగే పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఆటో, లారీ డ్రైవర్లకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించాలని కోరానని పేర్కొన్నారు. ఆయన వెంట సుదీప్‌రాజు తదితరులు ఉన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


సర్వేను తనిఖీ చేస్తున్న జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్

గంగవరం,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): ఎన్సీడీసీటీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ప్రోగామ్ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ వైద్య సిబ్బందికి సూచించారు. గంగవరం గ్రామంలో ఇంటింటా నిర్వహిస్తున్న ఎన్సీడీసీటీ సర్వేను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని అవసరమైన రక్తపరీక్షలు చేపట్టాలన్నారు. అవసరమైన వైద్య సలహాలు, సూచనలు అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): పుంగనూరు- తిరుపతి మార్గంలోని చదళ్ల వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం చింతలవారిపల్లెకు చెందిన అశోక్(25) సొంత పనులపై పుంగనూరుకు వచ్చి పనులు పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో ఉండగా చదళ్ల వద్ద ద్విచక్రవాహనం అదు పు తప్పి బోల్తా పడింది. అశోక్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో అతడిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అంగన్వాడీ కేంద్రాలకు వాటర్ ఫిల్టర్ల పంపిణీ

రొంపిచెర్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) మండలంలోని 32 అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆక్వా గార్డ్ వాటర్ ఫిల్టర్లు పంపిణీ చేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజరు శిరీష తెలిపారు.

రీసర్వే పనుల పరిశీలన

సోమల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లెలో జరుగుతున్న భూముల రీసర్వే పనులను తహసీల్దార్ బెన్నురాజ్ పరిశీలించారు. రీసర్వేను ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని, సరిహద్దుల గుర్తింపులో జాగ్రత్తలు పాటించి మళ్లీ ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సర్వే చేయాలని సూచించారు.

అభివృద్ధిని అడ్డుకోవడానికే వైసీపీ ధర్నా

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్



చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని అడ్డుకోవడం కోసమే వైసీపీ నేతలు పాత బస్టాండ్ వద్ద ధర్నా చేశారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కృషిచేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయ్యాయని చెప్పారు. పేదలకు, చిరువ్యాపారులకు ఎక్కడైనా ఇబ్బందులొస్తే ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చినప్పుడు వీలైనంత వరకు పరిష్కారం చూపుతున్నారన్నారు. నగర అభివృద్ధికి ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

ఆకు రౌడీ వంశీని అరెస్టు చేస్తే వైసీపీ నేతలకు ఉలుకెందుకు?: టీడీపీ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆకు రౌడీ వల్లభనేని వంశీని అరెస్టు చేస్తే వైసీపీ నేతలకు ఉలుకెందుకని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ప్రశ్నించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఒక దళితుడిని వంశీ కిడ్నాప్ చేసి కొట్టి, బెదిరించిన కేసులో అరెస్టు చేస్తే వైసీపీ నేతలు నానాయాగి చేస్తున్నారని విమర్శించారు. దళితుడి పక్షాన నిలబడాల్సింది పోయి వంశీ పక్షాన డీజీపీని కలవడానికి ప్రయత్నించడం, కలవకపోతే రాష్ట్ర ప్రభుత్వంపై నెపం మోపడం విచిత్రంగా ఉందన్నారు. వంశీని అరెస్టు చేయడంతో ప్రజలంతా సంబరాలు జరుపుకుంటే.. వైసీపీ నేతలు అక్రమ అరెస్టు అని ప్రెస్‌మీట్‌లు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. నేతలు మేషాక్, ధరణి ప్రకాష్, సాయికుమార్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

ఆటోడ్రైవర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఆటోడ్రైవర్లకు నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్డు నియమ, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

థామస్ చొరవతో జోరుగా అభివృద్ధి పనులు: టీడీపీ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ చొరవతో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయని పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. టీడీపీనేతలతో కలిసి గంగాధరనెల్లూరు బస్టాప్ కూడలిలో శుక్రవారం ఉదయం థామస్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కృష్ణమ నాయుడు మాట్లాడుతూ.. కోటాగరం పంచాయతీ ఎట్టేరిలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాభివృద్ధికి రూ.83.70లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందంటే దీనికి థామస్ కృషే కారణమన్నారు. టీడీపీ యాదవసాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, మండల అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, మండల టీడీపీ ప్రధానకార్యదర్శి జ్యోతిరెడ్డి, నేతలు పాల్గొన్నారు.



థామస్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

గ్రామాల అభివృద్ధికి అధికారులే కీలకం: ఎంపీపీ

నింద్ర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి అధికారులే కీలకమని ఎంపీపీ దీప అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రసంగించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధులకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యల్లేకుండా చూడాలని చెప్పారు. సంక్షేమ పథకాల మంజూరులో తమకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేయడం తగదని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల సమావేశానికి సీడీపీవో రావడం లేదని, పలు సమస్య ఆమె దృష్టికి తేవాలని కో-ఆప్షన్ సభ్యులు అనిల్ కోరారు. వైస్ ఎంపీపీ దుర్గాదేవి, ఎంపీడీవో ప్రసాద్ వర్మ, తహసీల్దార్ శేషగిరిరావు, ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివరామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్ రెడ్డి, ఎంఈవో శ్రీధర్‌రాజు, వైద్యాధికారి నిరోషా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ దీప

పెట్రో ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలి: ఏఐటీయూసీ



ఆటో కార్మికులతో కలిసి నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): డీజిల్, పెట్రోలు ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలని ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. కార్వేటినగరంలో శుక్రవారం కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం మండలాల ఆటో కార్మికుల సమావేశం జరిగింది. నేతలు మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా నేత దాసరి చంద్ర, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వసంతరాయలు, జిల్లా కార్యదర్శి విజయకుమార్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం తప్పదని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ హెచ్చరించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కమిషనర్ నరసింహ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం పర్మినెంట్, అవుట్ సోర్సింగ్ కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు.

వేము కళాశాలలో మెగా రక్తదాన శిబిరం

పూతలపట్టు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కొత్తకోట సమీపాన ఉన్న వేము ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్ కిలారి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఎదుటివారి ప్రాణాలు కాపాడాలన్నారు. అనంతరం 350 మందికిపైగా విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్వో రవి, కో-ఆర్డినేటర్ చెన్నయ్య, ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

విద్యుత్, తాగునీటి సమస్యలు తలెత్తకూడదు: ఎంపీపీ



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ అమరావతి తదితరులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ అమరావతి కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ.. అటవీప్రాంతాలకు సమీపంలో ఉన్న పొలాలను ఏనుగుల గుంపు నాశనం చేస్తున్నాయని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో కాల్వలు లేకపోవడంతో మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోందన్నారు. వైస్ ఎంపీపీ విజయకుమార్, ఎంపీడీవో శ్రీధర్, తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎంఈవోలు నాగేశ్వర్‌రావు, రమేష్, పశుసంవర్ధక శాఖ ఏడీ షేక్ ఆసీఫ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీ మోహన్ చెప్పారు. నగర పరిధిలోని 14వ డివిజన్‌లో రూ.9.90 లక్షలు, 21వ డివిజన్, కుక్కలపల్లె, గాండ్లకొత్తూరులో రూ.4.99 లక్షల ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, మురకంబట్టు ప్రధాన ప్రధాన కూడలిలో రూ.10 లక్షలతో చేసిన అభివృద్ధి, సుందరీకరణ పనులకు శుక్రవారం వారు ప్రారంభించారు. వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, టీడీపీ నేతలు కోదండయాదవ్, చంద్రప్రకాష్, మధుబాబు, లక్ష్మీపతి నాయుడు, సునీల్‌చౌదరి, శ్రీధర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



21 డివిజన్‌లో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్

సెల్‌ఫోన్లకు విద్యార్థులను దూరంగా ఉంచాలి

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు కలెక్టర్ సుమిత్ కుమర్ సూచించారు. శుక్రవారం పీసీఆర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రసంగించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేస్తోందని చెప్పారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మేయర్ అముద, డీఈవో, డీఎంహెచ్‌వో తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం ఆర్‌కేఎస్ఆర్ స్కూల్‌లోని విద్యార్థులకు శుక్రవారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. కత్తిరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి, సీహెచ్‌సీ డాక్టర్ గోపినాథ్ పాల్గొన్నారు.

ఐరాల(కాణిపాకం): కళ్లను ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా కాపాడుకోవాలని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర బాబు, డాక్టర్లు అర్పిత, స్వాతి సింధూర, రాజేశ్వరి, హరిప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుకు మించిన సంపద లేదు



పుస్తకాలతో విద్యార్థులు

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చదువును మించిన సంపద ఏదీ లేదని శతావధాని ఆముదాల మురళి అన్నారు. శుక్రవారం తెలుగు సాహిత్యం సాంస్కృతిక సమితి కోశాధికారి పైనేని మురళి జన్మదినం సందర్భంగా గంగమ్మగుడి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సమితి అధ్యక్షుడు పి.తులసినాథం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. అమృత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.25వేల విద్యాసామగ్రిని విద్యార్థులకు వితరణ చేశారు. పాఠశాల గ్రంథాలయానికి సమితి తరఫున పుస్తకాలను అందించారు. హెచ్‌ఎం రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధన చేయాలి

పాలసముద్రం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ సూచించారు. శుక్రవారం రంగాపురం ప్రాథమిక పాఠశాల, ఆముదాల, పాలసముద్రం, వెంగళరాజుకుప్పం ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో రికార్డులను పరిశీలించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 గిరిజ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ

'ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను భర్తీ చేయండి'

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను భర్తీ చేయాలని ఏపీ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం కోరారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, సరెండర్ లీవ్‌లు, డీఏలు, ఐఆర్‌లను విడుదల చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు ఉమాపతి, కోశాధికారి రామచంద్రయ్య, నగర అధ్యక్షుడు వెంకటేష్, సలహాదారుడు హరికృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భూతగాదాలో సర్పంచి భర్తకు గాయాలు

నగరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలో నగరి మండలంలోని బీరకుప్పం పంచాయతీ కావేటిపురంలో సర్పంచ్ భర్త మునస్వామికి గాయాలయ్యాయి. కావేటిపురం లెక్క దాఖలాలో సర్వేనెంబరు 8లోని 7.88 ఎకరాల స్థలం పోరంబోకు అని మునస్వామి వాదించగా, తాము కొనుగోలు చేశామని మరోవర్గం చెప్పింది. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో మునస్వామి గాయపడ్డాడు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. ఇరువురూ రికార్డులు తీసుకొస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మునస్వామి

ఏడుగురు కోడిపందెంరాయుళ్ల అరెస్టు

నగరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాకవేడు మిట్టిండ్లు వద్ద కోడిపందేలు ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కోళ్లు, రూ.630 స్వాధీనం చేసుకున్నారు. వీరిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించారు.

దాడిపై కేసు నమోదు



చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తనపై దాడి జరిగిందని ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓల్డ్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన విజయ్‌కుమార్ (36) గురువారం రాత్రి స్థానికంగా ఉన్న మెడికల్ షాపు వద్ద మందులు కొంటున్నాడు. ఆ సమయంలో విజయ్‌కుమార్‌కు అదే కాలనీకి చెందిన సురేష్ ఫోన్‌చేసి ప్రభుత్వ పాఠశాల వద్దకు రావాలని చెప్పాడు. అక్కడికెళ్లగా పథకం ప్రకారం ముందుగానే తెచ్చుకున్న కత్తితో దాడిచేశాడు. ఈ దాడిలో విజయ్‌కుమార్‌కు చెయ్యి, వీపుభాగంలో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు శుక్రవారం తెలిపారు.

రికార్డుల్లేని వాహనాల సీజ్



నగరి ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని మాంగాడులో శుక్రవారం డీఎస్పీ అజీజ్, సీఐ మహేశ్వర్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డుల్లేని 10 మోటర్ బైక్‌లను సీజ్ చేశారు. అనంతరం గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఐదు లీటర్ల సారాను సైతం స్వాధీనం చేసుకున్నారు.

భూ వివాదంలో ఇరువర్గాలపై కేసుల నమోదు

పెనుమూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చార్వాగానిపల్లెలో జరిగిన భూ వివాదంలో ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. రోడ్డు పోరంబోకు భూమిలో జయప్రకాష్‌నాయుడు 30 ఏళ్లుగా పెంకుటిల్లు నిర్మించుకుని, అందులో చిరువ్యాపారం చేసుకుంటున్నాడు. ఆ స్థలం తమదని.. పెంకుటిల్లును అదే కాలనీకి చెందిన మీనా దంపతులు, పద్మ, సంధ్య, బాలకృష్ణ కూల్చేందుకు ప్రయత్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. జయప్రకాష్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, మరో వర్గంలో ఐదుగురిపై సాధారణ కేసు నమోదు చేశారు. దీనిపై తహసీల్దారును వివరణ కోరగా.. గొడవ జరగడానికి కారణమైన భూమి రోడ్డు పోరంబోకు అని చెప్పారు. దానిపై రెండు వర్గాల వారికి ఎలాంటి హక్కులేదని చెప్పారు.

రేషన్ డీలర్‌కు షోకాజ్ నోటీసు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వినాయకపురంలోని 41 రేషన్ షాపు డీలర్ నిత్యవసర వస్తువుల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని లబ్ధిదారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం అధికారులు స్టాక్ రికార్డులను పరిశీలించారు. 3500 కిలోలు ఉండాల్సి బియ్యం కేవలం 146 కిలోలు మాత్రమే ఉందని గుర్తించారు. అలాగే చెక్కె 25 కిలోలు ఉండాల్సి ఉంటే 100 గ్రాముల కూడా లేదని తేలిందని రెవెన్యూ అధికారులు శుక్రవారం వెల్లడించారు. దీనిపై వివరణ ఇవ్వాలని డీలర్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చామని తెలిపారు. అప్పటివరకు షాప్ బాధ్యతలను స్థానిక వీఆర్వోకు అప్పగించారు.

సంక్షిప్తంగా..

దామోదరం సంజీవయ్యకు నివాళి

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ తొలి దళిత సీఎం దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం నివాళి అర్పించారు. సంజీవయ్య చిత్రపటానికి మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్‌లు పుష్పాంజలి ఘటించారు. ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విలేఖరి మృతి

తవణంపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొడతరకు చెందిన విలేఖరి గోపీనాథ్ రెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. కొంతకాలంగా పలు చానళ్లలో పనిచేస్తూ వచ్చిన ఈయన మూడ్రోజుల కిందట అనారోగ్యంతో చికిత్స నిమిత్తం వేలూరు నారాయణి ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు.



గోపీనాథ రెడ్డి (ఫైల్ ఫొటో)

తాలుకా ఎస్ఐ బాధ్యతల స్వీకారం

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తాలుకా ఎస్ఐగా మల్లికార్జున శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా ఉన్న రమేష్ బాబు బదిలీపై వీఆర్‌కు వెళ్లారు.



మల్లికార్జున

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా నివారణాధికారి వేణుగోపాల్ సూచించారు. శుక్రవారం టెలిఫోన్ కాలనీని పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీడీనెల్లూరు వైసీపీ అధ్యక్షుడిగా పూర్ణచంద్రారెడ్డి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జీడీ నెల్లూరు వైసీపీ అధ్యక్షుడిగా రెండోసారి నెల్లేపల్లె పంచాయతీ ఎన్.లక్ష్మీరెడ్డిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ పూర్ణచంద్రారెడ్డిని నియమించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి నుంచి అందాయి.



చెత్త నుంచి సంపద సృష్టించండి

పాలసముద్రం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించాలని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం శ్రీకావేరిరాజుపురం ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించారు. ఎస్‌డబ్ల్యూపీసీ ఆవరణలో మొక్కలు నాటించి గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి ఎరువును తయారు చేసి విక్రయిస్తే పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. సర్పంచ్ మహేష్‌నాయుడు, ఈవోపీఆర్డీ రమేష్, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య కోసం పేర్లు నమోదు చేసుకోండి

రైతులకు ఏవో సూచన

ఐరాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విశిష్ట సంఖ్య కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలని రైతులకు ఏవో వరలక్ష్మి సూచించారు. దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే వివిధ పథకాలు, రాయితీలు పొందవచ్చన్నారు. రైతు సేవా కేంద్రాల వద్దకు తమ పట్టాదారు పాసుబుక్కు లేదా లేదా 1బీ, ఫోన్ నెంబరుతో లింకు అయిన ఆధార్ కార్డు జెరాక్సులను రైతులు తీసుకెళ్లాలన్నారు.

క్రీడల్లో అరూరు విద్యార్థుల ప్రతిభ





వెంకటేష్ - జయంతి

నింద్ర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అరూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు వెంకటేష్, జయంతిలు క్రీడల్లో ప్రతిభ చూపారు. పుణెలో జరిగిన జాతీయ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించడంతో వీరికి ప్రభుత్వం ద్వారా రూ.50వేల ప్రోత్సాహక నగదు అందిందని ఫిజికల్ డైరెక్టర్ జ్ఞానకుమార్ తెలిపారు.

పుల్వామా ఘటనలో వీర సైనికుల త్యాగం మరువలేనిది

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుల్వామా ఘటనలో అమరులైన వీర సైనికుల త్యాగం మరువలేనిదని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళీమోహన్ అన్నారు. వీర సైనికుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ శుక్రవారం గాంధీ విగ్రహం వద్ద విశ్రాంత ఆర్మీ జవానులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నాయకులు చంద్రప్రకాష్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

యాదమరి: వరిగపల్లె, పెరుమాళ్లపల్లె ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన కార్యాక్రమాల్లో పీఆర్టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కె.కనకాచారి, మహిళా వైస్ ప్రెసిడెంట్ హిమబిందు, మండల మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ కాంచన, గుడుపల్లె పీఆర్టీయూ మహిళా కార్యకర్త హేమలత, అఖిలాండేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు, మాజీ సైనికులు

అతివేగం, నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు: డీటీసీ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అతివేగం, నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని డీటీసీ నిరంజన్‌రెడ్డి అన్నారు. కోటాగరం పంచాయతీ ఎట్టేరిలోని శ్రీభానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆవరణంలో రోడ్డు భద్రత వారోత్సవాలపై జరిగిన అవగాహన సమావేశంలో ప్రసంగించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హైస్కూల్ కరస్పాండెంట్ మద్దిపట్ల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ లావణ్య, ఆర్టీవో సునీల్‌కుమార్, ఎంవీఐలు రాజేశ్వరరావు, నరసింహులు, వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్ అందచేస్తున్న డీటీసీ నిరంజన్‌రెడ్డి